# అంతయునూ 'కొ(తి)నుట'లోనే యున్నది !

పాత విషయాలే ఒకోసారి కొత్తగా కనిపిస్తాయి. ఒక విషయం మళ్లీ మళ్లీ జరిగినప్పుడు బాధించేదయితే కొత్తగానే అనిపిస్తుంది.

ఈ ప్రపంచం అంతా 'అమ్మటలోనూ కొనుటలోనే ఉంది' అన్నాడో మహానుభావుడు. అది అక్షరసత్యమని తరచు రుజువవుతూనే ఉంది.




అమ్మడం, కొనడం వస్తువులకే పరిమితమయితే బావుండేది. అలా అనాదిగా జరగడం లేదు.

అప్పు తీర్చడం కోసం సత్యహరిశ్చంద్రుడు భార్య చంద్రమతినే అమ్మేశాడు.

కొనేవాళ్లుండడంవల్ల అమ్మేవాళ్లున్నారా, అమ్మేవాళ్లు ఉండడం వల్లే కొనేవాళ్లు ఉంటున్నారా? ఇది విత్తుముందా, చెట్టు ముందా వంటి చిక్కు సమస్య కాదు.

అమ్మడం, కొనడం డబ్బుతో ముడిపడి వుంది కాబట్టి, కొనేవాళ్లుండడం వల్లే అమ్మేవాళ్లుంటారని అనుకోవచ్చు.

కొనేవాళ్లు లేకపోతే, అవసరమున్నా అమ్ముదామనుకుంటే కుదరదు. కొనుగోలు శక్తి ఉన్న చోటే అమ్మకాలూ బాగా జరుగుతాయి.

కొందరి కారణంగా విలువలు మారుతున్నాయి. ఇంకా చెప్పాలంటే విలువల వలువలు ఊడిపోతున్నాయి.

కాదేదీ కవితకనర్హం అన్నట్టుగా కాదేదీ కొనుగోలుకనర్హం అంటున్నారు కొందరు.

ఇప్పుడు ఈ ప్రపంచం అంతా 'తినుట'లోనే వుంది. తినే వస్తువుల్లో పేదరికమూ ఉంది.

పేదరికాన్ని ఆసరా చేసుకునే డబ్బు ఆశ చూపి కళ్లూ కొంటున్నారు. కిడ్నీలూ కొంటున్నారు.

నువ్వో పాతికవేలకు ప్రలోభపడితే నీ కన్ను తీసేసి ఏ లక్షకో కొనేవాళ్లకు అమ్మేస్తారు.

నువ్వో ఏభైవేలకు మెత్తబడితే నీ కిడ్నీని తీసేసి ఎన్ని లక్షలకో కొనేవాళ్లకు అమ్మేస్తారు.

ఇక్కడ బ్రోకర్ల నుంచి బడా బడా డాక్టర్ల వరకూ డబ్బుకోసం ఎంతటి గబ్బు పనైనా చేసేవాళ్లున్నారు.

నీ పేరాసే వాళ్ల పెట్టుబడి!

నీ ప్రలోభమే వాళ్ల రాబడి!!

పసిపిల్లలు దేవుళ్లతో సమానం అనుకునే రోజులు పోయాయి. శిశువులూ కొందరికి విక్రయ వస్తువులే.

వెయ్యికో రెండువేలకో పిల్లల్ని కొని, వేలకు వేలకు కొనే సంస్థలకు అమ్మేవాళ్లున్నారు. వేలకు కొన్న శిశువుల్ని దత్తతకిచ్చే లక్షల రూపాయలు లాభాలు గడించే స్వచ్ఛంద సంస్థల యజమానులున్నారు.

కోట్లు కూడబెడుతూ సంఘసేవకులుగా పేరు గడించేవాళ్లున్నారున్నారు. బేథా హోం సావిత్రులూ ఉన్నారు. ప్రెషస్ హోం అనితాసేన్‌లూ ఉన్నారు.

ఆడపిల్ల పుట్టగానే ఇంట్లో మహాలక్ష్మి వెలిసింది అనుకునే రోజులు, అంతవరకూ బంగారు రోజులు.

ఇప్పుడు ఆడపిల్ల పుడితే శని దాపురించిందనుకునే వాళ్లు కొందరున్నారు. ఆడపిల్లని పెంచి పోషించడమే కాకుండా కట్నాలిచ్చి పెళ్లి చేయడం కష్టమనుకుని అమ్ముకునే పేదలున్నారు. దత్తత పేరుతో విదేశాలకు అమ్మి సొమ్ము చేసుకునే వాళ్లుండడంవల్లే వీళ్ల అమ్మకాలు జరిగాయి.

'మీ పిల్లల్ని మీరు అమ్ముకునే బదులు మీలో మీరే కట్నాలు పుచ్చుకోకుండా మీ పిల్లల పెళ్లిళ్లు చేసుకోండి. అలా తీర్మానించుకోండి. కొన్ని పాములు వాటి పిల్లల్ని అవే తింటాయి. అలాంటి పాముల్లా మారి ధన మధాంధులైన సావిత్రమ్మ లాంటి వాళ్లకు పావుల్లా మారకండి' అని చెప్పేవాళ్లు లేకపోయారు.

నీ అజ్ఞానమే వాళ్ల ఖజానా!

నీ పేదరికమే వాళ్ల నజరానా!!

శిశువుల్నే కాదు, ఎదిగిన నీ ముగ్ధల్నీ అమ్మిపెట్టే వాళ్లున్నారు.

శిశువుల్ని దత్తత పేరుతో, విదేశీయులకు అమ్మినట్టే ముగ్ధల్ని పెళ్లి పేరుతో విదేశీయులకు అమ్మిపెట్టే వాళ్లు ఉన్నారు.

ముగ్ధల్ని వేలో లక్షలో పెట్టి కొనుక్కునే, ఒళ్లంతా 'నూనె'కారే ముసలి తొత్తుకొడుకులున్నారు.

పేద ముస్లింలకు బంగారు భవితవ్యాన్ని కళ్లముందు చూపెట్టి, అరబ్‌షేక్‌లతో పెళ్లిళ్లు జరిపించే బ్రోకర్లున్నారు.

భార్య అంటే పక్కలో రంభ, ఇంటిలో పని మనిషి అని గట్టిగా నమ్మే ముసలి జిడ్డుగాళ్లకు డబ్బు పడేస్తే కొండమీద కోతి అయినా దిగొస్తుందని నమ్మకం.

అలా అరబ్ షేక్‌లతో ఇరవై వేలకో ఏభై వేలకో ప్రలోభపడి తమ ఆడపిల్లలనిచ్చి పెళ్లిళ్ళు చేసిన తర్వాత దుఃఖపడుతున్న తల్లిదండ్రులెంతోమంది ఉన్నారు.

అయిదువేలు తీసుకుని అరబ్ షేక్‌తో హైదరాబాద్ ముస్లిం ముగ్ధకు పెళ్లి చేయించే క్వాజీలున్నారు.

రెండొందలిస్తే అదే రోజున వివాహ ధ్రువపత్రం ఇచ్చే వక్ఫ్‌బోర్డూ వుంది. మైనర్ అమ్మాయినయినా 20-35 ఏళ్ల వయసు చూపిస్తే గుడ్డిగా ఆమోదించడమూ ఉంది.

జిడ్డుకారే ముసలి సౌదీ మగమహారాజులకు ప్రతి ఏటా హైదరాబాద్ పేద ముస్లిం తల్లిదండ్రులు పెళ్లిపేరు మీద మూడువేల మంది అమ్మాయిలను అమ్ముతున్నారు. వీరిలో తొంభై శాతం మంది

భార్యలుగా కాక, సుఖాలిచ్చే ఉంపుడు గత్తెలుగా, ఇల్లు ఊడ్చే పనిమనుషులుగా మాత్రమే అక్కడ దుర్భర జీవితం గడుపుతున్నారు.

అంచేతనే'అమ్మా, నేను మీ అల్లుడికి భార్యను కాను, కేవలం పనిమనిషిని మాత్రమే' అని షకీలా తన తల్లికి ఉత్తరం రాసింది.

నీ పేదరికం వాళ్ల రాచరికం

నీ దాపరికం వాళ్ల అనాగరికం!!

అర్జునుడు మత్స్యయంత్రం ఛేదించి, ద్రౌపదిని తెచ్చుకుంటే కుంతీదేవి అనాలోచిత మాట ప్రకారం మిగతా నలుగురు అన్నదమ్ములూ కూడా ఆమెకు భర్తలయినట్టే, ముస్లిం ముగ్ధను పెళ్లాడి అరబ్ షేక్ తీసుకెళ్తే అతని సోదరులూ ఆమెను అనుభవించే సందర్భాలూ అక్కడున్నాయి.

అంచేతనే, 'ప్రియమైన అమ్మా! ఇప్పుడు నీకు ఒకడు కాదు, అయిదుగురు అల్లుళ్ల ఉన్నందుకు గర్వించవే అమ్మా, గర్వించు' అని విసిగి వేసారిన ఓ ముస్లిం అమ్మాయి పరమ వెటకారంగా తన మాతృమూర్తికి లేఖ రాసింది.

ఇలాంటి అమ్మకాలూ, కొనుగోళ్లూ జరుగుతున్న ఈ ధూర్త లోకంలో మాటలు తప్ప చేతలు చూపించలేక తలవంచుకు వెళ్లిపోయినట్టేనా ఫెమినిస్టు మహిళా సంఘాలూ ప్రజా సంఘాలూ మన ఘనత వహించిన సర్కారూ !

11-5-2001

వార్త దినపత్రిక,